**కథ**

# విశ్వద

## విశ్వదకి సన్నగా తలనెప్పి మొదలయింది.

**ఈమధ్య ఆఫీసులో తరచూ ఇలాంటి నెప్పే వస్తోంది.**

**ఆమె తలనెప్పికి కారణం అభిరామ్! ఈమధ్యే ట్రాన్స్‌ఫర్ మీద తన సెక్షన్‌కి వచ్చిన అతను ఆమెని ఏ ఫైలో అడ్డం పెట్టుకుని గుచ్చి గుచ్చి చూడడమే ఈ తలనెప్పికి కారణం.**

విశ్వదకి అతను తనని వివస్త్రని చేసి అంగాంగాలనీ తడిమి చూస్తున్న అనుభూతి కలుగుతోంది. ఆ చూపుల్లో తృష్ణ ఆమెకి తలనెప్పి కలిగిస్తోంది. మొదట్లో తనది వట్టి అనుమానమే అనుకుంది కానీ మొన్న ఛాయ చెప్పిన మాటల వల్ల నిజమేనని రూఢీ అయింది.

''అభిరామ్‌కి నువ్వంటే చాలా ఇష్టంట... ఒకసారి నీతో ఒంటరిగా మాట్లాడాలంటున్నాడు. అతనుండే రూం నువ్వు మీ ఇంటికి వెళ్లే దార్లోనేట!'' అని మధ్యవర్తిత్వం చేసింది.

విశ్వద కోపంగా ''ఛాయా... నీకు నా గురించి అంతా తెలిసీ ఇలాంటి రాయబారాలు మోసుకొస్తావా? తప్పు కదూ... ఇంట్లో తెలిస్తే చంపేస్తారు! అతనికి అలాంటి ఊహలు పెట్టుకోవద్దని చెప్పు!'' అంది.

''అతనికి నీ గురించి అన్నీ చెప్పేశాను'' అంది ఛాయ.

విశ్వద ఉలిక్కిపడి చూసింది.

''అన్నీ తెలిశాకే ఆ మాట అన్నాడు. చూడు విశ్వదా మోడులా బ్రతకాల్సిన అందం కాదు నీది. ఇంకా మోయాల్సిన బ్రతుకు చాలా ఉంది. గానుగెద్దులా ప్రొద్దుట లేచినప్పటి నుండీ ఆ ఇంట్లో చాకిరీ చేసి వచ్చి ఇక్కడ వంచిన తల ఎత్తకుండా పని చేస్తావు. మళ్లీ సాయంత్రం ఆ ఇంటికి ఏ ఇంట్రెస్ట్‌తో వెళ్తావో తెలీదు. ఏ అనురక్తీ లేని ఆ కొంపలో మసిపట్టిన లాంతరు సెమ్మెలా మిగిలిపోతున్నావు. నాలుగునాళ్లైనా జ్వలించే ప్రమిదలా ఎందుకుండకూడదూ? చూడూ... జీవితం చాలా చిన్నది. అనుభవించకుండానే వడిలి రాలిపో నీకు...'' ఇలా చాలా క్లాస్ తీసుకుంది.

విశ్వదకి అప్పటినుండీ ఏ పని చేస్తున్నా ఆ మాటలు గుర్తొచ్చి తలనెప్పొస్తోంది. అభిరామ్ ఎదురుగా ఉన్నంతసేపూ మరీ మరీ వస్తోంది.

అభిరామ్ చూపుల్లో కోర్కె తీవ్రత పెరిగిపోతున్నకొద్దీ ఆమెకి ఉద్యోగం మానేసెయ్యాలన్న నిశ్చయం బలపడిపోతోంది.

★ ★ ★

విశ్వద ఇంట్లోకి అడుగు పెడ్తుంటేనే, ''ఏం... ఆలస్యం అయిందీ? బజార్లో కానీ దిక్కులు చూస్తూ ఆగిపోయావా? ఇంటి కోడలు అలా రోడ్లమీద ఎవరికైనా కనపడితే... మా పరువేం కావాలి?'' మావగారి సణుగుడు మొదలయింది.

పక్షవాతంతో మంచాన పడ్డ అత్తగారు ''విశ్వదా ఇలారా'' అని పిలుస్తోంది.

విశ్వద కొంగు నడుంకి దోపి ఆవిడ కాలకృత్యాలు తీర్చే పనిలో నిమగ్నమయింది.

మరిది చొక్కా కుట్టమని ఇచ్చాడు.

మావగారు ఆకలని కేకలు పెట్టాడు. పంపొస్తోంది నీళ్లు పట్టుకోమని పక్కవాటా ఆవిడ పిలిచింది. పాలవాడు డబ్బులు ఇవ్వడం ఆలస్యమయిందని వార్నింగ్‌లిచ్చాడు.

ఇదంతా అయి అందరికీ అన్నాలు పెట్టి ఎంగిళ్లు సర్ది తను స్నానం చేసొచ్చి నుదుట కుంకుమ దిద్దుకుంటుంటే గూట్లో మూర్తితో తనున్న పెళ్లి ఫోటో కనిపించింది.

''మనమూ ఒక స్కూటర్ కొనుక్కుంటే ఎంత బావుంటుందండీ?'' అంది ఒకనాడు భర్తతో రాత్రివేళ.

ఆ మాటకి అతను ఆమె నుండి దూరంగా తొలగి ''నేను అసమర్థుడ్ని... నీ కోర్కెలు తీర్చలేను... ఆ సంగతి ఇప్పుడు గుర్తు చేస్తున్నావా?'' అని అరిచాడు.

మావగారూ, అత్తగారూ గదిలోకొచ్చి కలుగజేసుకుని ''మొగుడితో కాపరం చేసే లక్షణాలేనా ఇవీ?'' అని బుగ్గలు నొక్కుకుని ఆమెని చీవాట్లు పెట్టేదాకా రంకెలేశాడు.

ఆ తర్వాత విశ్వదని మూర్తి దగ్గరకి తీసుకోడం మానేశాడు. వయసు వేడికి తట్టుకోలేక ఆమె అతనికి దగ్గరగా జరిగితే ''నేను ప్రయోజకుడ్ని అని నిరూపించుకున్నాకా... అప్పుడూ...'' అని దూరంగా తోసేసేవాడు.

ఇంత శిక్ష విధించడానికి తనంత పెద్ద తప్పేం చేసిందో ఆమెకి ఇప్పటికీ అర్థం కాదు.

అనుకోకుండా ఒక దీపావళి నాడు అతను ఇల్లు వదిలిపెట్టి వెళ్లిపోయాడు. ఎక్కడికెళ్లాడో, ఎప్పుడొస్తాడో..అసలు వస్తాడో రాడో ఎవరికీ చెప్పలేదు. కొడిగట్టిన దీపంలా ఆమె మిగిలిపోయింది.

ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి. విశ్వద బొట్టు పెట్టుకుంటున్న విధవలా బ్రతుకీడుస్తోంది. ఆమెకి భోజనం నుండి కట్టే బట్ట వరకూ అన్నింటిలోనూ కట్టడులే... విశ్వద పరువానికి కోరికలు కలుగకుండా అత్తగారూ మావగారూ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు.

''జడలో పూలెక్కడివీ? కొన్నావా?'' మావగారు గర్జించారు.

''పక్కావిడ ఇచ్చింది.''

''తీసెయ్! అవన్నీ నీలాంటి వాళ్లకి కాదు.''

విశ్వద మౌనంగా పూలు తీసేసి అన్నం తినకుండానే తన గదిలోకి వెళ్లి పడుకుంది.

ఆ మూడు గదుల వాటాలో కడుపు చించుకు ఏడవాలన్నా లేదు. ఇంట్లో అందరికీ తన జీతం కావాలి... జీవితం కాదు.

ఆ రాత్రి ఛాయ మాటలు గుర్తొచ్చాయి మళ్లీ. అభిరామ్ చూపులు...బాధించాయి.

వెంటనే లేచి కూర్చుంది. తప్పు చేసినట్లు చెంపలు వేసుకుని, గూట్లోంచి రామకృష్ణ పరమహంస పుస్తకం తీసుకుని చదువుతూ కూర్చుంది.

★ ★ ★

''పార్టీ అన్నావు... ఎవరూ రాలేదే?'' విశ్వద ఛాయ ఇంట్లో అడుగుపెడ్తూనే ఆశ్చర్యంగా అడిగింది.

''వస్తారు... ముందు నువ్వు ఆ ముడి విప్పి చక్కగా జడ వేసుకో... మొహం కడుక్కుని బొట్టు పెట్టుకో... ఫ్రెష్‌గా కనిపిస్తావు'' అంది ఛాయ.

''ఎందుకూ?'' ఆమె ఆశ్చర్యంగా అడిగింది.

''చెప్తా...వెళ్లు'' ఛాయ ఆమెని బాత్‌రూంలోకి తోసింది.

విశ్వద తయారై బయటకొచ్చేసరికీ ఛాయ లేదు. అభిరామ్ ఉన్నాడు.

విశ్వద కోపంగా చూసింది.

అతను భయంగా లేచి నిలబడ్డాడు.

ఓ గంట తర్వాత అభిరామ్ ఆమెని స్కూటర్ మీద ఇంటి దగ్గర దిగబెట్టాడు.

గుమ్మం దగ్గరే కాపలా కాచే మావగారు చూసి

నోరు తెరిచేశాడు. ఆయనకి గుండె ఆగినంత పనైంది.

విశ్వద కొంగు నిండా కప్పుకొని ఆయన ముందు నుండే నడిచి లోపలికి వెళ్లిపోయింది.

పక్కింటావిడ కుతూహలంగా చూస్తున్నదల్లా ముసలాయన తన వంక చూసేసరికి లోపలికి వెళ్లిపోయింది.

విశ్వద లోపలికెళ్లి అత్తగారి సేవలు చేస్తూ మావగారి తిట్ల కోసం ఊపిరి బిగబట్టి ఎదురుచూసింది.

ముసలాయన అసలు పొద్దుపోయేదాకా లోపలికే రాలేదు.

ఆ రాత్రి ఆమె నిద్రపోయాకా పెళ్లాం గదిలోకి వచ్చాడు.

ఆవిడ దిగాలుగా ఉన్న భర్తని చూసి ''ఏమైందీ'' అన్నట్లు కళ్లెగరేసింది.

''కష్టం...కోడలు మరో గూడు వెతుక్కుని ఎగిరిపోతే... మనం ముగ్గురం ఇంత విషం తిని చావడం తప్ప గత్యంతరం లేదు'! అని అభిరామ్ విశ్వదని ఇంటి దగ్గర దింపడం గురించి చెప్పాడు.

''అమ్మో...ఇది ఇంతకి తెగించిందా? ఇప్పుడెలా?'' ఆవిడ గుండెలు బాదుకుంది.

''ష్...నెమ్మదిగా!'' ఆయన భార్యని మందలించాడు.

తెల్లారాక విశ్వద ఆఫీసుకి వెళ్లే తొందర చూపకపోతే ఆయన అడిగాడు. ''ఏమ్మా? ఒంట్లో బాగోలేదా? ఆఫీస్‌కి వెళ్లలేదేం?''

మావగారు అంత ప్రేమగా, మృదువుగా మాట్లాడడం ఎరగని విశ్వద తెల్లబోయింది.

''లేదు మావయ్యా... నేను ఉద్యోగం మానెయ్యాలనుకుంటున్నాను'' అంది.

''ఏం?'' ఆయన భయంగా అడిగాడు.

విశ్వద ఇంక ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తూ ఆయనకి అభిరామ్ అన్న మాటలన్నీ చెప్పేసింది.

''నన్ను ప్రేమిస్తున్నాననీ... పెళ్లి చేసుకుంటాననీ అతను వెంట పడుతున్నాడు. ఒద్దంటే వినడం లేదు. రోజూ చూస్తుంటే... నావల్ల కాదు... అందుకే'' అని అసంపూర్తిగా వదిలేసింది.

ముసలాయన నెరిసిన తలని నిమురుకుంటూ ఆలోచించాడు. అనుభవం సంయమనం నేర్పింది కాబోలు.

''ఆ సంగతి నాకొదిలేయ్... ఈవేళ్టికి ఇంట్లో ఉండు. రేపటి నుండీ ఆఫీస్‌కెళ్దువుగానీ!'' అన్నాడు.

ఆమె మావగారి వైపు సంభ్రమంగా చూసింది.

★ ★ ★

అభిరామ్ ఆయన వైపు చెప్పమన్నట్లు చూశాడు.

''నేను విశ్వద మావగార్ని. నా కొడుకు ఎక్కడున్నాడో...అసలున్నాడో లేడో తెలీదు! ఆమెని పెళ్లి చేసుకుంటానని నువ్వు వెంట పడ్తున్నావట...''

''మీరే ఆలోచించండి...మీ కూతురైతే ఇలా చేస్తారా?'' అభిరామ్ ఆవేశపడ్డాడు.

ఆయన ఆగమన్నట్లు చెయ్యి చూపించాడు.

''నే చెప్పేది విను... నీకిష్టమైతే ఆమెనిచ్చి పెళ్లి చేస్తాను.''

అభిరామ్ అవాక్కయి చూశాడు.

''కానీ ఒకే ఒక్క షరతు. ఆమె ఉద్యోగం చేయాలి...మా ఇంట్లోనే ఉండాలి. ఆమెతో బాటు నువ్వు కూడా! నా కొడుకు స్థానంలో...'' అన్నాడు.

అభిరామ్ అర్థం అయినట్లు చూశాడు.

''ఆమె జీతం మీ కుటుంబానికి ఆధారం... అంతేగా!'' అన్నాడు.


ఆయన తల ఊపాడు.

★ ★ ★

అభిరామ్ మకాం విశ్వద ఇంటికి మారింది.

''మావయ్యా ఇది తప్పు!'' విశ్వద బాధగా అంది.

''ఇంకా పెద్ద తప్పులు జరక్కుండా దిద్దుతున్న తప్పు'' అన్నాడాయన. ఆ తర్వాత ఎంతో నచ్చచెప్పాడు.



బలభద్రపాత్రుని రమణి

తూ తూ మంత్రంగా పెళ్లి జరిపించడానికి ఆయన నెల తర్వాత ముహూర్తం పెట్టాడు.

ఆ రాత్రి మంచం మీద పడుకున్న అభిరామ్ వైపు చూసి సిగ్గుగా తల వంచుకుంది విశ్వద.

అతను ఆమెని అమాంతం తన మీదకి లాక్కున్నాడు.

''ఒక్క నిమిషం...'' ఆమె మెడలోంచి మంగళసూత్రం తీసి పెట్లో పడేసి వచ్చింది. కోర్కెలు పడగ విప్పాయి.

ఆ రాత్రి వాళ్ల గదిలోంచి వచ్చే మంచం శబ్దం, నవ్వులూ ఇంటిల్లిపాదీ అసహనంగా విన్నారు.

★ ★ ★

ఇప్పుడు వారింట్లోకి టీవీ వచ్చింది. ఫ్రిజ్ చేరింది. మరిది వేరే ఊళ్లో కాలేజీలో చేరాడు. అత్తగారికి డాక్టర్ ఇంటికి వచ్చి వైద్యం చేస్తున్నాడు.

ఎంతో హాయిగా ఉంది జీవితం! విశ్వదకి మళ్లీ తలనెప్పి రాలేదు.

ఒకనాడు ''పెళ్లికి నీకు గొలుసు చేయించాను'' అన్నాడు పొట్లం విప్పుతూ అభిరామ్.

''అదొక్కటి మిగిలింది కదూ...'' విశ్వద నవ్వుతూ చెయ్యి చాపింది. ఆనందంతో ఆమె శరీరం మెరిసిపోతోంది.

ఇంతలో ముందు గదిలో ముసలాయన గొంతు పెద్దగా వినపడింది.

''మూర్తీ...ఒరే..మూర్తీ..నువ్వట్రా?''

విశ్వద దిగ్గున బయటకొచ్చి చూసింది.

మూర్తి నవ్వుతూ వచ్చి తల్లిని కౌగిలించుకుంటున్నాడు.

''నేను ప్రయోజకుడ్ని అయి వచ్చానమ్మా! బొంబాయిలో వ్యాపారం చేస్తున్నాను. చాలా సంపాదించాను. నా భార్యేదీ?'' అడుగుతున్నాడు.

విశ్వద చేతిలోంచి గొలుసు జారిపోయింది.


అభిరామ్ తలుపు దగ్గరే ఆగిపోయి ముసలాయన వైపు చూస్తున్నాడు. అతని కళ్లల్లో వెయ్యి ప్రశ్నలు.

''నా నాయనే...నా తండ్రే... మూర్తీ... విశ్వద అదిగో...నీ కోసమే కళ్లు కాయలు కాచేటట్లు ఎదురుచూస్తుందిరా పాపం!... ఆ... ఇతను అభిరామ్...మన కుటుంబానికి బాగా సాయం చేశాడు. విశ్వద వైపు బంధువు...'' ఎవర్నీ మాట్లాడనివ్వకుండా మాట్లాడేస్తున్నాడు ముసలాయన.

విశ్వద తెల్లబోయి చూస్తుండిపోయింది.

★ ★ ★

ఆ రాత్రి ఆమె గదిలో మంచం మీద కూర్చుని ఉంది.




మావగారు లోపలికొచ్చి ''జరిగిందేదో జరిగింది...అభిరామ్ అర్థం చేసుకున్నాడు. నువ్వు మూర్తికేమీ చెప్పకు...'' అన్నాడు.

''ఇది అన్యాయం...'' విశ్వద అరవబోయింది.

ఆయన ఆమె నోరు నొక్కి గుడ్లెర్ర జేస్తూ అన్నాడు.

''నా కొడుక్కి నీ గురించి ఉన్నవీ లేనివీ చెప్పానంటే చంపేస్తాడు... వాడి పంతం నీకు తెలుసుగా... నోరు మూసుకుని పడి ఉండు'' అన్నాడు.

విశ్వదకి మావగారి అసలు స్వరూపం అర్థమవసాగింది.

ఆయనకి కావల్సింది జరుగుబాటు.

అందుకే విశ్వద ఎగిరిపోకుండా అభిరామ్‌ని ఎర వేసి ఆపాడు.

అభిరామ్ కన్నా ఎక్కువ సంపాదిస్తున్న కొడుకు కనిపించేటప్పటికీ అభిరామ్‌ని విదిలించేసి మళ్లీ విశ్వదని ఎర వేస్తున్నాడు!

ఆమె మౌనంగా ఆయన వైపు చూసింది.

ఆ రాత్రి మూర్తి గదిలోకొచ్చి తలుపు గెడ వేసి వెనక్కి తిరిగేసరికి విశ్వద లేచి నిలబడుతూ అంది.

''మూర్తీ...తలుపు తియ్యి... నన్ను వెళ్లనీ... నువ్వు పెట్లో పెట్టి దాచుకుని వెళ్తే అలాగే పడి ఉండడానికి నేను బొమ్మని కాదు... ప్రాణం ఉన్న మనిషిని... నీ మనిషిని మాత్రం కాదు... నన్ను ఆపాలని చూస్తే ఎంతకైనా తెగిస్తాను... వెళ్లనీ!''

అతను ప్రాన్పడిపోయి చూస్తుండగా ఆమె అందరి ముందునుండీ ధైర్యంగా నడిచి వెళ్లిపోయింది.



## ఏం జరుగుతుందో?

**బాలీవుడ్‌లో నిజాలకన్నా రూమర్లే రాజ్యమేలతాయి. అయితే కొన్ని రూమర్లు కొన్నాళ్ళకి నిజమవుతాయి. కళ్లతో కట్టిపడేసే కత్రినాకైఫ్‌ని సల్మాన్‌ఖాన్ పెళ్ళి చేసుకోబోతున్నట్టు వార్తలొస్తున్నాయి. చాలాకాలం నుంచి చాలా క్లోజ్‌గా తిరుగుతున్న ఈ జంట తమ వివాహబంధానికి సంక్రాంతిని ఎంచుకున్నాయంటున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వీరిద్దరూ జనవరి ఆఖరుకి పెళ్ళి చేసుకోవడం ఖాయమని పరిశ్రమై వర్గాలు ఘంటాపథంగా చెబుతున్నాయి. ఏం జరుగుతుందో కొన్నాళ్ళు ఆగాల్సిందే. ఇదిలా ఉండగా సల్మాన్ మాత్రం వివాదాస్పద నటి ప్రీతీ జింతా కలిసి ఓ సినిమాలో నటించడానికి సంతకాలు చేసేశాడని వినికిడి.**